ఈనాడు
యాదాద్రి భువనగిరి
శుక్రవారం అక్టోబరు 25, 2024

స్వయంభూ క్షేత్రంలో సంప్రదాయ ఆరాధనలు


కల్యాణమూర్తులు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో గురువారం స్వయంభువులైన పంచనారసింహులను ఆరాధిస్తూ చేపట్టిన ఆస్థాన, ఆర్జిత పూజలు ఆలయ ఆచారంగా కొన సాగాయి. వేకువజామున సుప్రభాతం చేపట్టిన పూజారులు గర్భాలయ ద్వారాలను తెరిచి మూలవరులను హారతితో కొలిచారు. పాలతో నిజాభిషేకం నిర్వహించాక, తులసి పత్రాలతో అర్చన చేపట్టారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వర్ణమూర్తులకు స్వర్ణ పుష్పార్చన క్రతువు కొన సాగించారు. ఉగ్ర నరహరిని శాంతింపజేసేందుకు శ్రీసుదర్శన నారసింహహోమం నిర్వహించారు. లోకకల్యాణార్థమై శ్రీలక్ష్మీనరసింహ స్వామి నిత్యకల్యాణం ఆలయ ఆచారంగా చేపట్టారు. కల్యాణ మూర్తులను గజవాహనంపై అలంకృతులను చేసి సేవ పర్వాన్ని నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార జోడు సేవలను మంగళ వాయిద్యాలు, మంత్ర పఠనాలతో మాడవీధుల్లో ఊరేగించారు. రాత్రి గర్భాలయంలోని స్వయంభువులను కొలుస్తూ ప్రత్యేక ఆరాధన జరిపారు. దర్బార్ సేవోత్సవంలో నిత్యాదాయాన్ని వెల్లడించారు. వివిధ విభాగాల ద్వారా రూ.12,52,664 ఆదాయం చేకూరింది. అనుబంధంగా కొనసాగుతున్న శివాలయంలో నిత్య పూజలు ఆలయ ఆచారంగా కొనసాగాయి.

ప్రజల సహకారం అవసరం

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా పశుగణన కార్యక్రమాన్ని నేటి నుంచి చేపడుతున్నామని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కృష్ణ తెలిపారు. పశుగణన కార్యక్రమం నాలుగు నెలల పాటు కొనసాగి 28 ఫిబ్రవరి 2025 నాడు ముగుస్తుందని తెలిపారు. జిల్లా పరిధిలోని 17 మండలాల పరిధిలోని 421 గ్రామ పంచాయతీల్లో ఇంటింటి పశుగణన కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో 34 మంది పర్యవేక్షకుల ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 130 మంది ఎన్యూమరేటర్లు వివరాలను సేకరిస్తారని తెలిపారు. సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తామని తెలిపారు. గ్రామాల్లో ఎప్పుడు ఈ కార్యక్రమం నిర్వహిస్తారో ముందస్తుగా తెలియజేస్తామని తెలిపారు. పశుగణన కార్యక్రమానికి ప్రజలు సహకరించి వివరాలు గణకులకు అందజేయాలని కోరారు.

డివిజన్ బెంచ్‌కు రాయగిరి ట్రిపుల్ ఆర్ బాధితులు

భువనగిరి, న్యూస్‌టుడే: ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలంటూ ప్రాంతీయ వలయ రహదారి బాధితులు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ నెల 15న రిట్ పిటిషన్‌ను కొట్టేయడంతో డబుల్ బెంచ్‌లో రిట్ అప్పీల్ దాఖలు చేశామని బాధితుల తరఫు న్యాయవాది బ్రహ్మాండం రమేష్ గురువారం 'న్యూస్‌టుడే'కు తెలిపారు. అలైన్‌మెంట్ మార్పు చేయాలని కోరుతూ గతేడాది రాయగిరి గ్రామానికి చెందిన 32 మంది రైతులు రిట్ పిటిషన్ దాఖలు చేయడంతో స్టే ఇచ్చిన విషయం విదితమే. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి సింగిల్ బెంచ్ న్యాయమూర్తి పిటిషన్‌ను డిస్మిస్ చేయడంతో అప్పీల్ కోసం 30 రోజుల గడువు ఉన్నందున రిట్ అప్పీల్ దాఖలు చేశారు. ఇప్పటికే ఐదుసార్లు ప్రభుత్వ అవసరాల కోసం తమ భూములను ఇచ్చి నష్టపోయామని మరోసారి భూములు ఇస్తే తామ నష్టపోతామని బాధిత రైతులు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఒకే వ్యక్తి ఐదుసార్లు భూములు కోల్పోవడం రాజ్యాంగ విరుద్ధమని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. భూములు కోల్పోతున్నామన్న ఆందోళనతో ముగ్గురు రైతులు గుండెపోటుతో హఠాన్మరణం చెందారని పిటిషన్‌లో ప్రస్తావించారు.

భూనిర్వాసితుల ధర్నా


చౌటుప్పల్: ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణానికి తమ భూములను ఇవ్వబోమని నేలపట్ల, తంగడపల్లి గ్రామాలకు చెందిన భూనిర్వాసితులు ఆర్డీవో వెల్మ శేఖర్‌రెడ్డికి తెలిపారు. త్రీజీ నోటిఫికేషన్‌లో భాగంగా రైతుల నుంచి భూమి పత్రాలు, ఆధార్, బ్యాంకు పాసు పుస్తకం, పాన్ కార్డు వివరాలు సేకరించేందుకు స్థానిక తహసీల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన రైతులు ఆర్డీవో ఎదుట తమ ఆవేదనను వెలిబుచ్చారు. ఓ ఫార్మా కంపెనీని ట్రిపుల్ ఆర్ పరిధి నుంచి తప్పించేందుకు అలైన్‌మెంట్‌ను రీజినల్ రింగ్ రోడ్డు నుంచి 40 కిలోమీటర్లకు బదులు 28కి కుదించి తమకు అన్యాయం చేశారని ఆరోపించారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ధర ప్రకారం తమకు నష్ట పరిహారం చెల్లించాలని ఆర్డీవోను కోరారు. ధర్నా నిర్వహించారు.

మహిళాశక్తి క్యాంటీన్ ప్రారంభం


చౌటుప్పల్, న్యూస్‌టుడే: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలని చౌటుప్పల్ పురపాలిక ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు కోరారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో లింగోజిగూడెంలో శ్రీహనుమాన్ స్వయం సహాయక సంఘం ద్వారా ఏపీజీవీబీ ఆర్థిక సహకారంతో నెలకొల్పిన ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. కౌన్సిలర్లు బండమీది మల్లేశ్, కొయ్యడ సైదులు, ఉబ్బు వరమ్మ, మెప్మా టీఎంసీ కవిత, సంఘం సభ్యురాళ్లు దీప, శిరీష తదితరులు పాల్గొన్నారు.

బీమా.. అన్నదాతకు ధీమా..!

రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే:



ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికి అందివచ్చే తరుణంలో ప్రకృతి విపత్తుల కారణంగా నష్టం జరగడం ఉమ్మడి నల్గొండ జిల్లాలో సర్వసాధారణంగానే మారింది. ఏటా అకాల వర్షాలు, వడగళ్ల వానలు రైతులను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. రూ.వేలు పెట్టుబడి పెట్టి నిరాశకు గురవుతున్నారు. ఈ విషయమై ప్రభుత్వం రైతులను ఆదుకునే క్రమంలో పంటల బీమా అమలు చేయాలని సంకల్పించింది. ఇటువంటి పరిస్థితుల్లో పంటల బీమాను వచ్చే సీజన్ నుంచి ప్రారంభిస్తామని తాజాగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించడంతో కర్షకుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలో మొత్తం సుమారు 9,08,810 మంది రైతులుండగా, సుమారు 18.08 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటల సాగును చేపడుతున్నట్లు అధికారులంటున్నారు.



ప్రయోజనం ఇలా..

ఉమ్మడి నల్గొండ జిల్లాలో అధిక శాతం వ్యవసాయం పైనే ఆధారం. ముఖ్యంగా సింహ భాగం రైతులు వరి, పత్తి, మొక్కజొన్న, కందితోపాటు కూరగాయలు సాగు చేపడుతుంటారు. వన్యప్రాణుల బెడదకు తోడు వేలాది ఎకరాల్లో ప్రతిఏటా వడగళ్లు, అకాల వర్షాలు కురిసి ఇక్కడి పంటలకు తీవ్రంగా నష్టం జరగడం పరిపాటి అనే చెప్పవచ్చు. ఇలాంటి తరుణంలో సదరు పంటలకు బీమాతో ప్రయోజనం చేకూరనుందన్నది వాస్తవం. ముఖ్యంగా వడగళ్లు కురిసినా.. వర్షాలు లేక పంటలు ఎండిపోయినా సాగు సమయంలో రైతులు వాటికి బీమా చేసుకుంటే ఉపయోగంగా ఉంటుంది. గతంలో గ్రామం యూనిట్‌గా బీమా చేస్తుండేవారు. దీనివల్ల కర్షకులకు ప్రయోజనం ఉండేది. ఎకరాకు రూ.500 ప్రీమియం చెల్లిస్తే నష్టపోయిన సమయంలో రూ.వేలాదిగా డబ్బులు వస్తుండేవి. బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న సమయంలో బీమా ప్రీమియం డబ్బులు తీసుకునేవారు. నష్టపోతే వరికి ఎకరాకు రూ.37,484, పత్తి రూ.38,282, మొక్కజొన్నకు రూ.18,742 పరిహారం వచ్చేది.

పేదరిక నిర్మూలనలో భాగస్వాములు కావాలి

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


సూర్యాపేటలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో పేదరిక నిర్మూలనకు అధికారులు, ప్రజా ప్రతినిధులు, రచయితలు, కళాకారులు భాగస్వాములు కావాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, కళాకారులు, రచయితలు, ప్రముఖులతో నిర్వహించిన ముఖాముఖిలో గురువారం భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాల కార్యక్రమాలు బాగున్నాయని.. భవిష్యత్తు మహిళా సాధికారతపైనే ఆధారపడి ఉందని చెప్పారు. వైద్యారోగ్యం, విద్యారంగాలను పరిశీలిస్తే జిల్లా మెరుగైన స్థానంలో ఉందన్నారు. 2024లో పదో తరగతిలో 96.91 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులకు విద్యతో పాటు చేతి వృత్తులకు సంబంధించి వస్తువుల తయారీలో మెలకువలు అందిస్తే మరింత విజ్ఞానవంతులు అవుతారని పేర్కొన్నారు.

ఘన స్వాగతం

జిల్లాకు వచ్చిన గవర్నర్‌కు రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, అధికారులు ఘన స్వాగతం పలికారు. తొలుత రాష్ట్ర గవర్నర్ సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయ ఆవరణలో వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జిల్లా అధికారులు, ప్రముఖుల ముఖాముఖిలో పాల్గొన్నారు. సూర్యాపేట జిల్లా ప్రాముఖ్యం, సంస్కృతి, సంప్రదాయాలు, వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ముఖ్యమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్‌కు తెలియజేశారు. పలువురు కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, జాయింట్ సెక్రటరీ భవాని శంకర్, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, సూర్యాపేట, కోదాడ, తిరుమలగిరి పురపాలిక ఛైర్‌పర్సన్లు పెరుమాళ్ల అన్నపూర్ణ, గెల్లి అర్చన, అనసూయ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరిస్తాం:

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సూర్యాపేటలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ప్రిన్సిపల్ సెక్రటరీ బి.వెంకటేశం

తెలంగాణ రాష్ట్రం కేంద్ర ప్రభుత్వానికి అన్ని విషయాలలో చురుకైన సహకారం అందిస్తోందని, ఆహార భద్రతలో భాగంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రతి ఒక్కరికీ ఆరు కిలోల బియ్యం అందజేస్తున్నామని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. జనవరి నుంచి సన్న బియ్యాన్ని అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రాబోయే రోజుల్లో సూర్యాపేట జిల్లాను రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా చేయాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు ఇస్తామని తెలిపారు. సూర్యాపేటకు సంస్కృతి, సంప్రదాయాలతోపాటు చరిత్రాత్మకంగా ఎంతో పేరు ప్రఖ్యాతలు ఉన్నాయని వెల్లడించారు.

బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తులు



బార్ అసోసియేషన్ పరిచయ కార్యక్రమంలో పాల్గొన్న జడ్జిలు మాధవిలత, ఉషాశ్రీ, శ్యాంసుందర్

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: భువనగిరి ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీపై వచ్చిన ఎమ్.ఉషాశ్రీ, అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్యాంసుందర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా ఉన్న వి.మాధవిలత పూర్తిస్థాయి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బాధ్యతలు తీసుకున్నారు. బాధ్యతలు చేపట్టిన జడ్జిలకు బార్ అసోసియేషన్ హాల్‌లో స్వాగత పరిచయ కార్యక్రమం నిర్వహించి సత్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బబ్బూరి హరినాథ్, ఉపాధ్యక్షురాలు జయ, ప్రధాన కార్యదర్శి కృష్ణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రమాదకరం.. పహాడీనగర్ గుంత



ఇక్కడ జిల్లా స్థాయి అధికారులతో పాటు.. మూడు జిల్లాలకు వెళ్లే వారు నిత్యం ప్రయాణిస్తుంటారు. రోడ్డుపై ఒకే ప్రాంతంలో గత కొన్నేళ్లుగా గుంతలు పడుతున్నప్పటికి సంబంధిత అధికారులు శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇద్దరు ఇక్కడే ప్రమాదవశాత్తు పడి ప్రాణాలు కోల్పోయిన ఘటనలతో పాటు పదుల సంఖ్యలో తీవ్ర గాయాలపాలైన వారు ఉన్నారు. పహాడీనగర్ ప్రధాన రహదారిపై పడిన గుంతలను శాశ్వతంగా మరమ్మతులు చేపట్టాలన్న స్థానికుల డిమాండ్ నెరవేరడం లేదు. ఈ విషయమై పుర అధ్యక్షుడు పోతంశెట్టి వెంకటేశ్వర్లును వివరణ కోరగా ఈ విషయాన్ని ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, భువనగిరి పట్టణం

రక్షితనీటి సరఫరాలో సహాయకుల పాత్ర కీలకం: కలెక్టర్


శిక్షణార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న కలెక్టర్ హన్మంత్ కే జెండగే

ఆలేరు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రజలకు తాగునీటి సరఫరాలో సహాయకుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ హన్మంత్ కే జెండగే అన్నారు. ఆలేరులో మిషన్ భగీరథ ఆధ్వర్యంలో గ్రామ మంచినీటి సరఫరా సహాయకులకు నాలుగు రోజుల పాటు జరిగిన అవగాహన, శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా గురువారం రాత్రి ఆలేరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. మంచినీటి సహాయకులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని, నీటి సరఫరాలో తలెత్తే ప్రాథమిక సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. జిల్లాలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయన్నారు. శిక్షణ పొందిన వారికి కలెక్టర్ ధ్రువపత్రాలు అందజేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కృష్ణయ్య, ఈఈ కరుణాకరన్, జడ్పీ సీఈవో శోభారాణి, డీపీవో గోపాల్, ఎంపీడీవో సత్యాంజనేయప్రసాద్, ఏఈలు మహేష్, సుప్రియ పాల్గొన్నారు.

దివ్య దక్షిణ తీర్థయాత్ర, శబరిమలకు ప్రత్యేక రైళ్లు

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: భారత్ గౌరవ్ టూరిస్టు ట్రైన్‌లో భాగంగా దివ్య దక్షిణ తీర్థయాత్ర, శబరిమలకు ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్(ఐఆర్‌సీటీసీ) ఆధ్వర్యంలో ప్రత్యేక రైళ్లను ప్యాకేజీ ద్వారా నడిపిస్తున్నట్లు సంస్థ దక్షిణ విభాగం టూరిజం ఎగ్జిక్యూటివ్ పవన్‌సెంగర్ తెలిపారు. భువనగిరి రైల్వే స్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. దివ్య దక్షిణ తీర్థయాత్ర రైలు నవంబరు 6న సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం 12 గంటలకు మొదలవుతుందని తిరిగి 14వ తేదీకి చేరుకుంటుందని, ఈ యాత్రలో తిరుమణ్ణలై, రామేశ్వరం, మదురై, కన్యాకుమారి, త్రివేంద్రం, తిరుచ్చి, తంజావూరులోని పర్యాటక ప్రాంతాలు, ఆలయాలు దర్శించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఒక్కో టిక్కెట్ స్లీపర్ క్లాస్ ధర రూ.14,250 ఈ రైలు భువనగిరి స్టేషన్‌లో అగుంతుందన్నారు. శబరిమలకు 16వ తేదీన సికింద్రాబాద్ నుంచి వెళుతుందని ఈ రైలు నల్గొండలో ఆగుతుందన్నారు. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చునని వివరాల కోసం 9281030711లో సంప్రదించవచ్చని తెలిపారు. సమావేశంలో ఉద్యోగులు శ్రీకాంత్, నరేష్ పాల్గొన్నారు.

మెరుగైన విద్యనందించాలి


నాగినేనిపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో దస్త్రాలు పరిశీలిస్తున్న జిల్లా విద్యాధికారి సత్యనారాయణ

బొమ్మలరామారం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెరుగైన విద్య, భోజనం అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాధికారి సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని నాగినేనిపల్లి గ్రామంలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో దస్త్రాలను, పాఠశాల గదులను, విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం తల్లిదండ్రులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రోజా రాణి, పాఠశాల కమిటీ ఛైర్‌పర్సన్ మోత్కుపల్లి భాగ్య పాల్గొన్నారు.


పశుగణనకు శ్రీకారం




◆ యాప్‌లో సమగ్ర సమాచారం నిక్షిప్తం

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే:

పశు గణనకు ప్రభుత్వ యంత్రాంగం శ్రీకారం చుట్టింది. ప్రతి ఐదేళ్లకు ఒకసారి దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం పశుగణనను చేపడుతుంది. కేంద్రం ప్రణాళిక మేరకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణకు దిగుతోంది. 21వ గణనను పటిష్ఠంగా చేపట్టేందుకు పశుసంవర్ధకశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.. నేటి నుంచి ప్రారంభమయ్యే గణన 28 ఫిబ్రవరి 2025 వరకు కొనసాగనుంది. వివరాల నమోదు అనంతరం తదుపరి నెల నుంచి కొత్త గణాంకాలు అందుబాటులోకి రానున్నాయి. 2019లో నిర్వహించిన పశుగణనలో గతం కన్నా ఏడు శాతం పశువులు తగ్గినట్లు సర్వేలో తేలింది. ఈ సారి పశువుల పెరుగుదల, తగ్గుదలపై ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్రస్తుతం జిల్లాలో పశువుల వివరాలు...



	69,173
	1,22,621
	4,47,331
	45,08,382

★ పశుగణనకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. గణకులకు శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 130 మంది ఎన్యూమరేటర్లు సర్వేలో భాగస్వాములు కానున్నారు. ఒక్కో ఎన్యుమరేటర్ గడువులోపు నాలుగు గ్రామాల్లోని ఇళ్లను, పట్టణ ప్రాంతాల్లోని ఇళ్లను సందర్శించి ఎనిమిది రకాల పశువులు గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలు, కోళ్లు, గుర్రాలు, గాడిదలు, ఒంటెల వివరాలను యాప్‌లో నమోదు చేయనున్నారు. ఎన్యూమరేటర్ల పనితీరును జిల్లా పశుసంవర్ధక అధికారితో పాటు ముగ్గురు ఏడీలు, 34 మంది పర్యవేక్షకులు పర్యవేక్షణ చేయనున్నారు. ఎన్యూమరేటర్లు నమోదు చేసిన సమాచారం వెంటనే యాప్ ద్వార కేంద్రంలోని యాప్‌లో నిక్షిప్తం అవుతుంది. గతంలో పశుగణనను కొంత సమయంలో హడావుడిగా చేపట్టేవారు. గణనలో శాస్త్రీయత లోపించిందని ఉన్నతాధికారులు భావించి, ఈసారి పకడ్బందీగా చేపట్టాలని నిర్ణయించారు.



పశుగణన ప్రచార గోడ పత్రిక

పారదర్శకంగా..

గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని పశువుల సంఖ్యను నమోదు చేయనున్నారు. గతంలో పలు శాఖల ఉద్యోగుల్ని ఎన్యుమరేటర్లుగా ఎంపిక చేసేవారు. ప్రస్తుతం గణన గడువును పొడిగించడంతో పశుసంవర్ధకశాఖ ఉద్యోగులు, శిక్షకులు, ప్రైవేటు వ్యక్తులు గణన కార్యక్రమంలో భాగస్వాములు కానున్నారు. గణనలో పారదర్శకత, జవాబుదారీతనం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. గణనపై అన్ని ఆవాస ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఉన్న సమాచారంలో ఇళ్ల నమోదు కాకున్నా ఆయా ఇళ్లను పరిగణనలో తీసుకుని వివరాల్ని నమోదు చేస్తారు.

★ కోళ్లు, గొర్రెలు, మేకల సంఖ్య ప్రతి ఐదేళ్లకు ఒకసారి గణనీయంగా పెరుగుతుంది. ప్రజల ఆర్థిక స్థితిగతులు పెరగడంతో మాంసం, కోడిగుడ్ల వినియోగం పెరగడంతో కోళ్లు, గొర్రెలు 15 శాతం పెరగడం గమనార్హం.

ఏర్పాట్లు పూర్తి:

– డాక్టర్ కృష్ణ, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

పశుగణనకు ఏర్పాట్లు పూర్తి చేశాం. గణన ప్రక్రియను పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో నోడల్ అధికారిని నియమించాం. ఆవాస ప్రాంతంలోని అన్ని ఇళ్లను సందర్శించి ఎన్యూమరేటర్లు వివరాలు సేకరిస్తారు. ఈ విషయమై ప్రజల్లో అవగాహన పెంచేందుకు అన్ని ఆవాస ప్రాంతాల్లో ప్రచారం చేపడతాం.

సూర్యాపేట పట్టణంలో ఓ శుభకార్య వేదికలో హంగు, ఆర్భాటాలతో వివాహం జరిగింది. ఆహార పదార్థాలకు రూ.12 లక్షలు ఖర్చు చేసి, 16 రకాల వంటకాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమం ముగిశాక చూస్తే అతిథులకు వడ్డించిన విస్తర్లలోనే సుమారు రూ.2.5 లక్షల విలువైన పదార్థాలు వృథా అయినట్లు గుర్తించారు.

నల్గొండలో ఓ జంటకు తల్లిదండ్రులు వివాహం జరిపించారు. కట్నకానుకలు ఇతర సామగ్రికి రూ.2 లక్షలు పోను ఆహార పదార్థాలకు రూ.80 వేలు మాత్రమే వెచ్చించారు. రెండు రకాల కూరలు, అన్నం, సాంబారు, తీపి పదార్థాలను వడ్డించారు. వివాహానికి హాజరైనవారు తృప్తిగా భోంచేసి, అంతా బాగుందని కితాబిచ్చారు.

తినాలనే ఆశ.. వృథాపైనే ధ్యాస



నాంపల్లి, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో ఏటా భారీ సంఖ్యలో వివాహాలు జరుగుతున్నాయి. భారీస్థాయిలో హంగు ఆర్భాటాలకు వెళ్తూ.. లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. పొదుపు మంత్రం పాటిస్తేనే పెళ్లి చేసే తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకుండా జాగ్రత్త పడవచ్చు. ముందే మేల్కొని వివాహ ఖర్చులపై పూర్తి అవగాహన కలిగి ఉంటేనే ప్రయోజనం చేకూరే అవకాశాలున్నాయని నిపుణులు సూచిస్తున్నారు.

★ 2011 లెక్కల ప్రకారం ఉమ్మడి నల్గొండ జిల్లాలో 34.57 లక్షల జనాభా నివసిస్తోంది. ఏటా సుమారు 8 వేల నుంచి 10వేల వరకు పెళ్లిళ్లు జరుగుతున్నాయి. చిన్నస్థాయిలో చేసుకునే వివాహాలకు సాధారణంగా ఆహారానికి రూ.లక్ష వరకు, స్థాయిగల కుటుంబాల్లో రూ.1.5లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. సంపన్న వర్గాల కుటుంబాల్లో రూ.10 నుంచి రూ.25 లక్షల వరకు ఆహారానికి ఖర్చు చేస్తున్నారు. ఇంతలా అతిథి ఆతిథ్యం కోసం చేస్తున్న ఖర్చును అతిథులే గుర్తించకుండా చెత్తబుట్టలో వేస్తుండటంతో ఆర్థిక, పర్యావరణ సమస్య ఉత్పన్నమవుతోంది. చిత్తశుద్ధితో వ్యవహరిస్తే వృథా నియంత్రణకు అవకాశాలున్నాయి.

ఆలోచించండి

మీరు ఓ వివాహానికి వెళ్లారు. అక్కడ ప్లేట్ నిండా ఆహార పదార్థాలు వడ్డిస్తారు. మీరు వద్దన్నా.. ఆప్యాయంగా తినండని మర్యాద చేస్తారు. తీరా మీకు నచ్చినవి తిని మిగతావి పారేస్తారు. ఒక్క క్షణం ఆలోచించండి మీరు ఎంత వృథా చేశారో తెలుస్తుంది. అక్కడ అధిక సంఖ్యలో ఆహార పదార్థాలను ఏర్పాటు చేయడంతో ఏది తినాలో తెలియక అన్ని రుచి చూడాలని గిన్నె నిండా పెట్టుకుంటారు. మొత్తం తినలేక వృథా చేస్తారు.

గతంలో..

గతంలో అయితే శుభకార్యాల్లో అతిథులను కింద కూర్చోపెట్టి లేదా కుర్చీలు, టేబుళ్లు వేసి భోజనాలు వడ్డించేవారు. ఈ విధానంతో ఆహార పదార్థాలు తినకుండా వదిలేసేవారిని గుర్తించే అవకాశం ఉండటంతో వృథా తక్కువగా ఉండేది. ప్రస్తుతం వేడుక ఏదైనా పల్లె పట్టణమనే తేడా లేకుండా నిలబడి తినే (బఫే)విధానాన్నే అవలంబిస్తున్నారు. దీంతో ఆహార పదార్థాలు అలా రుచి చూసి ఇలా వదిలేస్తుండటంతో వడ్డించుకున్న పదార్థాల్లో 25శాతం వరకు చెత్త డబ్బాల్లోకే చేరుతోంది.

అన్నం పరబ్రహ్మ స్వరూపం..

'అన్నం పరబ్రహ్మ స్వరూపం' అంటారు. రోజూ ఎంతో మంది పేదలు ఆహారం దొరక్క అల్లాడుతున్నారు. గుప్పెడు మెతుకుల కోసమే కోట్లాది మంది పొట్టచేత పట్టుకొని వలస బాట పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో నిత్యం జరిగే వేడుకల్లో భారీగా ఆహార పదార్థాలు వృథా అవుతున్నట్లు అంచనా. నిర్వాహకులు పరిమితికి మించి ఆహార పదార్థాలు తయారు చేయకుండా ఉంటే మంచిది. వేడుకలకు వెళ్లే అతిథులు ఆయా శుభకార్యాలు తమవిగా భావించాలి. ఆకలికి తగ్గట్టుగా వడ్డించుకోవాలి. భోజనం మధ్యలో మీరు చెత్త డబ్బా వద్దకు వెళ్తున్నారంటే కచ్చితంగా ఆహారం వృథా చేస్తున్నట్టే లెక్క. ఏదైనా శుభకార్యాలు, ఇతర వేడుకల్లో ఆహారం మిగిలితే పారేయకుండా స్వచ్ఛంద సంస్థల సాయం తీసుకొని అనాథలకు అందజేస్తే ప్రయోజనం ఉంటుంది.

స్వయం శోధన... నిత్య సాధన

చిట్యాల, న్యూస్‌టుడే: భిన్న వ్యాపకాలను ఎంచుకుని వాటిపై స్వయంగా శోధిస్తూ, నిత్యసాధన చేస్తున్నారు చిట్యాలకు చెందిన పంతంగి నవీన్, హరిత కుమార్తెలు మేఘన, సాయిలేఖన. మేఘన ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో హోమియో వైద్యురాలిగా పనిచేస్తూ.. చిత్రలేఖనాన్ని, సాయిలేఖన హైదరాబాద్ గీతం విశ్వవిద్యాలయంలో బీఏ సైకాలజీ మొదటి సంవత్సరం చదువుతూ.. సంగీత పరికరాల వాయిద్యాన్ని ప్రవృత్తిగా ఎంచుకున్నారు. ఎలాంటి ప్రత్యేక శిక్షణ లేకుండానే ఎవరికి వారు ఆన్‌లైన్‌లో స్వయంగా శోధిస్తూ.. దానిపై పట్టు సాధించడానికి నిత్యం కనీసం రెండు గంటలు సాధన కోసం కేటాయించుకుంటున్నారు. తాము ఎదుర్కొనే ఒత్తిడిని తమ వ్యాపకాలతో అధిగమిస్తున్నామంటున్నారు.

నేర్పించిన చిట్కాలతో..:

డాక్టర్ పంతంగి మేఘన



చిన్నప్పుడు (మూడో తరగతిలో)మా పాఠశాలలో బొమ్మలు గీయడంలో ప్రాథమిక మెలకువలు నేర్పించేవారు. ఇంటి దగ్గర చిత్రకారుడైన మా చిన్నతాతయ్య మధుసూదన్ రావు చిత్రలేఖనంలో చిట్కాలు చెప్పేవారు. ఒత్తిడిని అధిగమించడానికి చాలామంది యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటివి చేస్తుంటారు. నేను చిత్రలేఖనంతో ఒత్తిడిని అధిగమిస్తాను. ఏదైనా ముఖ్యమైన నిర్ణయం తీసుకోవాలనుకున్నపుడు పెయింటింగ్ వేయడం అలవాటయింది. పెన్సిళ్ల నుంచి బ్రష్షులు, రంగులు, కాగితాల వరకు ఆన్‌లైన్‌లో చూసి కొనుగోలు చేస్తుంటాను. పెద్దచిత్రాలు రెండు రోజులు, చిన్న చిత్రాలయితే ఒక రోజులో పూర్తి చేస్తాను. హోమియో చదువుతున్నప్పుడు అంతర్ కళాశాలల మధ్య చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అందులో బహుమతి గెలుచుకోవడం మరపురాని అనుభూతి.

నిత్యం రెండు గంటలపాటు..

పంతంగి సాయిలేఖన



నేను ఇష్టంగా వరసగా ఒక్కొక్కటిగా కొనుగోలుచేసిన సంగీత పరికరాలతో సాధన చేయడానికి నిత్యం రెండు గంటల సమయం కేటాయించుకుంటాను. ప్రస్తుతం గిటార్, ఖలింబ(పియానోకు చిన్నవెర్షన్), వయోలిన్, క్లావ్‌బాక్స్, యుకులేలి, ఫ్లూట్ నాదగ్గర ఉన్నాయి. అన్నీ యూట్యూబ్‌లో చూసి వాయించడాన్ని నేర్చుకున్నాను. నాలుగో తరగతి నుంచే పియానో వాయించడం ప్రారంభించాను. స్నేహితులు, టీచర్లు అభినందించి ప్రోత్సహించారు. ఏటా కొత్త పరికరం కొని సాధన చేయాలని సంకల్పంగా పెట్టుకున్నాను. అడిగిన పరికరాలను అమ్మానాన్న తెచ్చి ప్రోత్సహించారు. వారం క్రితం మా విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలోనూ నా వాయిద్య ప్రదర్శన ఇచ్చాను. సంగీతంలో ఏఆర్ రహమాన్, శంకర్ మహదేవన్‌లు స్ఫూర్తి.

జాతీయ స్థాయిలో నితిన్ ప్రతిభ



మేజిక్ ఫెస్ట్‌లో జ్ఞాపిక, నగదు అందుకుంటున్న నితిన్

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరుకు చెందిన కట్కం నితిన్ జాతీయ స్థాయిలో జరిగిన మెజీషియన్ ఉత్సవాల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి హాజరైన వారిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ నెల 20న కేరళలోని కొచ్చిలో 'మలయాళీ మెజీషియన్స్ అసోసియేషన్' పరంగా జాతీయ స్థాయిలో మేజిక్ ఫెస్ట్ నిర్వహించారు. దక్షిణ భారతదేశంలోని ఐదు రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా ఇంద్రజాలికులు పాల్గొని ప్రదర్శనలు ఇచ్చారు. తెలంగాణ నుంచి పాల్గొన్న 18 మందిలో నితిన్ ప్రథమం స్థానంలో నిలిచారు. సంస్థ తరపున ప్రశంసా పత్రం, రూ.20 వేల నగదు అందజేశారు. నితిన్‌ను స్థానిక పద్మశాలీ యువజన సంఘాల నాయకులు గురువారం ఆలేరులో సన్మానించారు. బేతి రాములు, బింగి నర్సింహులు, పాశికంటి శ్రీనివాస్, ఆడెపు బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆనాటి దారి.. అందంగా మారి

ఊరికి దూరంగా.. కంపచెట్లతో.. మురుగు నీటికి నిలయంగా.. పందులకు ఆవాసంగా.. వానొస్తే రోజుల తరబడి నీళ్లలో నివాసం.. దోమలు, దుర్వాసనల మధ్య కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి ఒకప్పటి 60 ఫీట్ల దారిలోని ప్రజలది. ఆ దారి వెంట పదుల సంఖ్య జూనియర్ కళాశాలల నిర్వహణ మాత్రమే ఉండేది. పీఎస్ఆర్ సెంటర్ చివరి నుంచి అటు జాతీయ రహదారి వరకు అర కిలోమీటరు ఉండగా.. దాదాపు గుంతలే ఎక్కువగా దర్శనమిచ్చే దుస్థితి. కానీ నేడు ఆ దారి పరిస్థితి భిన్నంగా మారింది. దారి మొత్తం పూర్తిగా సీసీ రోడ్డు వెడల్పు పెంచేశారు. పలు విభిన్న వ్యాపారాలకు నిలయంగా మారింది. చిన్న హోటళ్ల నుంచి రెస్టారెంట్ల వరకు, పాఠశాలల నుంచి జూనియర్ కళాశాలల వరకు, టీస్టాళ్లు, సెలూన్ దుకాణాలు, సమోసా విక్రయ కేంద్రాలు, బేకరీలు ఇలా పదుల సంఖ్యలో వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆ దారి ప్రస్తుతం నిత్యం రద్దీగా మారింది. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులతో సందడి నెలకొంటుంది. ఇప్పుడు ఇక్కడ దొరకని వస్తువంటూ లేదని స్థానికులు చెబుతున్నారు.



రద్దీగా.. సందడిగా.. సూర్యాపేట 60 ఫీట్ల రహదారి

పూర్తిగా మారిపోయింది..

– రామ్మూర్తి, టిఫిన్ బండి నిర్వాహకుడు, సూర్యాపేట

ముప్పై ఏళ్లుగా టిఫిన్ బండి నడుపుతున్నా.. గతంలో రద్దీ ప్రదేశమైన ఏపూరు బస్టాండ్ వద్ద నిర్వహించా. 60 ఫీట్ల దారిలో ప్లాటు ఉండగా ఇల్లు కట్టుకున్నా. మొదట్లో ఇక్కడే బండి పెడదామనుకున్నా. కానీ ఈ ప్రాంత పరిస్థితిని చూసి వ్యాపారం సాగుతుందో లేదోనని భయపడి పూర్వ స్థానంలోనే నిర్వహించా. ప్రస్తుతం రహదారి రూపురేఖలు పూర్తిగా మారిపోవడంతో ఇక్కడే ఏర్పాటు చేసుకున్నా. ఇప్పుడు అక్కడి కంటే ఇక్కడే వ్యాపారం బాగుంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, యువకులు, వృద్ధులతో ఆ దారంతా సందడి మారింది.

– సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే:

ఊడిన బస్సు టైరు.. పాదచారునికి గాయాలు

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: ట్రావెల్ బస్సు పరుగెడుతుండగా.. టైరు ఊడిపోయిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం లింగోజిగూడెం సమీపంలో చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి విజయవాడకు ప్రయాణికులతో ట్రావెల్ బస్సు గురువారం ఉదయం బయలుదేరింది. లింగోజిగూడెంలోని భారత్ పెట్రోలియం బంకు వద్దకు చేరుకోగానే ట్రావెల్ బస్సు వెనుక టైరు ఊడిపోయింది. ఊడిన టైరు జాతీయ రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తున్న పాదచారుడికి తగలడంతో అతని కాలు విరిగింది. క్షతగాత్రుడు ఒడిశాకు చెందిన శశికాంత్ బిస్తాగా పోలీసులు గుర్తించారు. క్షతగాత్రుడిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. టైరు ఊడిపోయిన వెంటనే డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును నిదానంగా నిలపడంతో ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ పర్యవేక్షణలో ఎస్సై లక్ష్మయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఊడిపోయిన ట్రావెల్ బస్సు టైరు

హోరాహోరీగా కొనసాగిన క్రీడాపోటీలు

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధి శ్రీనివాసనగర్‌లోని మహాత్మా జ్యోతిబా పులే తెలంగాణ బీసీ సంక్షేమ బాలికల పాఠశాలలో గురుకులాల సొసైటీ ఉమ్మడి నల్గొండ జిల్లాస్థాయి క్రీడాపోటీలు రెండో రోజు(గురువారం) కొనసాగాయి. దామరచర్ల పాఠశాల, జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ ఉమాదేవి ప్రారంభించగా.. విద్యార్థినుల మధ్య పోటీలు హోరాహోరీగా సాగాయి. విద్యార్థులు ఒకరిని మించి ఒకరు పోటీ పడుతూ ప్రతిభ చాటారు. కబడ్డీ, ఖో-ఖో, వాలీ బాల్, రన్నింగ్ క్రీడా పోటీలు నిర్వహించారు.

అండర్-17 విభాగంలో.. కబడ్డీ: మొదటి స్థానం: దామరచర్ల గురుకులం విద్యార్థులు. తుమ్మడం గురుకులం విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు.



కబడ్డీ క్రీడలో తలపడుతున్న విద్యార్థినులు

ఖో-ఖో: 24 పాయింట్లు సాధించి నల్గొండ గురుకులం విద్యార్థులు మొదటి స్థానం. ఒకే ఒక పాయింట్ సాధించి వలిగొండ గురుకులం విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు.

రన్నింగ్: 100 మీటర్ల పరుగు పందెంలో దేవరకొండ గురుకుల విద్యార్థిని ఎస్. ఉమ మొదటి స్థానం. 400 మీటర్ల పరుగు పందెంలో నల్గొండ గురుకులం విద్యార్థినీ ఎం.ఇందు మొదటి స్థానం. 1500 మీటర్ల పరుగు పందెంలో భువనగిరి గురుకులం విద్యార్థిని వి.నవ్య మొదటి స్థానం. 4*100 మీటర్ల పరుగు పందెంలో నల్గొండ గురుకులం విద్యార్థిని ఎం.ఇందు. మొదటి స్థానంలో గెలుపొందారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉమాదేవి, అసిస్టెంట్ ప్రిన్సిపల్ సరిత, పీడీ ఇందిరా, పీఈటీ శాంతి, ఉపాధ్యాయురాళ్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బంగారానికి మెరుగుపెడతామని మోసం

త్రిపురారం, న్యూస్‌టుడే: బంగారానికి మెరుగుపెడతాం, పూసలు అల్లుతామంటూ ఇద్దరు వ్యక్తులు ఓ గ్రామంలో తిరుగుతూ. . మోసానికి పాల్పడిన ఘటన వెలుగు చూసింది. బాధితుల వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా త్రిపురారం మండలం కామారెడ్డిగూడెం పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో గురువారం హైదరాబాద్‌లోని కార్మికనగర్‌కు చెందిన 60 ఏళ్ల వయస్సు పైబడిన పత్తిపాటి నాగరాజు, బొబ్బ వెంకట్‌రెడ్డి తిరిగారు. ఆ క్రమంలో గ్రామానికి చెందిన కొంగరి సునీత వారితో పూసలు అల్లించుకున్నారు. బంగారానికి మెరుగుపెడతాం అనే సరికి తనకున్న రెండు తులాల పుస్తెల తాడును వారికి ఇచ్చారు. పుస్తెల తాడును ద్రావణంలో కరగబెట్టడంతో రాగి కలర్‌లోకి వచ్చింది. బరువు సైతం తగ్గింది. ఇది గమనించే లోగా.. అప్పటికే నిందితులు గ్రామం నుంచి పరారయ్యారు. బాధితురాలు గ్రామస్థులకు తెలియజేయడంతో గ్రామంలోని యువకులు మండల పరిధిలోని పరిసర గ్రామాల్లో ఆచూకీ కోసం బైక్‌లపై వెళ్లారు. చివరికి కంపసాగర్ పరిధిలోని కేవీకే సమీపంలో పట్టుకొని నిలదీయగా నిజం ఒప్పుకొన్నారు. తిరిగి గ్రామానికి వారిని తీసుకెళ్లి బంగారాన్ని కరగబెట్టగా 20 గ్రాములకు గాను 17 నుంచి 18 గ్రాములే వచ్చింది. జరిగిన ఘటన ప్రచార మాధ్యమాల్లో వైరలైంది. గ్రామస్థులు వారిద్దరిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

బీసీ జేఏసీ ఛైర్మన్‌గా ధనుంజయ

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: ఉమ్మడి నల్గొండ జిల్లా బీసీ జేఏసీ ఛైర్మన్‌గా పెండెం ధనుంజయనేత నియమితులయ్యారు. ఈ మేరకు ఈ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య గురువారం హైదరాబాద్‌లోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నియామకపత్రం అందజేశారు. యువకులు బీసీ ఉద్యమంలో పాల్గొని బహుజన రాజ్యాధికారం సాధించాలని సూచించారు. జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, జెల్ల నరేందర్, వెంకటేశం, నందగోపాల్, ఉదయ్, రమేష్, యాదయ్య, సయ్యద్, వెంకన్న పాల్గొన్నారు.



ధనుంజయనేతకు నియామకపత్రం అందజేస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

పీల్చేగాలి.. తాగేనీరు.. ఖరాబు

దేశంలో వాయు కాలుష్యంతో ఏటా 33 వేల మంది మృత్యువాత పడుతున్నట్లు జాతీయ గ్రీన్ ట్రైబ్యునల్ సంస్థ' నివేదికలు ఇటీవల స్పష్టం చేస్తున్నాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ సంస్థల నివేదికలను సుమోటోగా తీసుకున్న ఎన్‌జీటీ తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలికి ఈ నెల 21న నోటీసులు జారీ చేయటంతో పాటు వెంటనే కాలుష్యంపై విచారణ ప్రారంభించింది.

ఉమ్మడి జిల్లాలో 319 అనుమతి పొందిన భారీ, 84 మధ్యతరహా, 8,069 సాధారణ చిన్నతరహా పరిశ్రమలు ఉన్నాయి.71,687 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. రోజువారీ కూలీలు లక్ష మంది వరకు ఉన్నట్లు అంచనా.

2019లో ప్రభుత్వం జీవో 33తో 'జిల్లా స్థాయిలో గాలి నాణ్యత పర్యవేక్షణ కమిటీ'లను ఏర్పాటు చేసినా.. అవి కాగితాలకే పరిమితం కాగా.. ఆచరణలో కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

మిర్యాలగూడ, న్యూస్‌టుడే:

తెలంగాణ ప్రాంతంలో అత్యధికంగా కాలుష్యం వెలువరించే జిల్లాల్లో హైదరాబాద్ మహానగరం తర్వాత ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రధానంగా ఉంది. ఇక్కడ రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యం ఆరోగ్యాలపై ప్రభావం చూపుతోంది. సాధారణంగా కాలుష్య రేణువుల స్థాయి 2.5 మైక్రాన్లు ఉండాల్సి ఉండగా అంతకంటే 1.6 శాతం నల్గొండ జిల్లాలో ఎక్కువగా ఉన్నట్లు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ గతంలో నివేదించింది. ఈ పరిస్థితిని చూస్తే పెరుగుతున్న పరిశ్రమలతో కాలుష్యం తీవ్రత సైతం అదే రీతిలో పెరుగుతోందని అర్థమవుతోంది.



మిర్యాలగూడలో పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థపు నీరు గుంతల్లో నిలిచిన తీరు



రైస్‌మిల్లుల నుంచి వచ్చే బూడిద గాంధీనగర్‌లోని ఇళ్లపై పడిన తీరు (పాత చిత్రం)

14 ఏళ్ల క్రితమే పీసీబీ ఆందోళన..

ఆసియా ఖండంలోనే అత్యధికంగా బియ్యం పరిశ్రమలు ఉమ్మడి జిల్లాలో ఉన్నాయి. 14 ఏళ్ల క్రితం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నీటి, వాయు కాలుష్యం తీవ్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ పరిశ్రమల నిర్వాహకులకు మూడు రోజుల పాటు అవగాహన సదస్సులు నిర్వహించారు. పరిశ్రమల్లో వ్యర్థపు నీటిశుద్ధి ట్యాంకులు నిర్మించి నీటిని శుద్ధిచేసిన తరువాత బయటకు వదలాలని, మిల్లుల పొగగొట్టాలు 60 అడుగులకు మించి ఎత్తులో నిర్మించాలని ఆదేశించారు. బూడిద, పొట్టు గాలిలో కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సిమెంటు పరిశ్రమల కాలుష్యంతో గాలి, పరిసరాలు కాలుష్యం పెరిగిపోతుండగా సమస్య తీవ్రరూపం దాల్చుతుంది.

ముక్కుమూసుకుని వెళ్లాల్సిందే..

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ప్రయాణించే వారికి దుర్వాసనలు వచ్చాయంటే చాలు చౌటుప్పల్ వచ్చినట్లుగా సంకేతం వస్తుంది. భరించలేని వాసనలు వెదజల్లే పరిశ్రమలు యాదాద్రి జిల్లాలో విస్తరించి ఉండగా వీటి కాలుష్యం వ్యర్థాలు ఒక్కోసారి రహస్యంగా తెచ్చి రహదారుల వెంట పోస్తున్నారు. జాతీయ రహదారిపై వెళ్లే ప్రయాణికులు ముక్కుమూసుకోకుండా వెళ్లలేని పరిస్థితి కాలుష్య తీవ్రతకు అద్దం పడుతోంది.

ఉమ్మడి జిల్లాలో..

- చర్మ వ్యాధులతో బాధపడేవారు సుమారు 15,200 మంది
- ఊపిరితిత్తుల సమస్యలపై ఇబ్బంది పడేవారు సుమారు 18,020 మంది

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: కౌలుకు పొలం చేసుకుని గౌరవంగా బతుకుతున్న ఓ పేదకుటుంబానికి చెందిన యజమానిని విద్యుదాఘాత రూపంలో మృత్యువు కబళించింది. భార్య కళ్ల ముందే విద్యుదాఘాతంతో భర్త విగత జీవిగా మారటంతో ఆమె రోదనలు మిన్నంటాయి. ఈ హృదయ విదారక ఘటన మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామీణ ఎస్సై లోకేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నల్లగంతుల యల్లయ్య(40) భార్య రేణుక మరో కూలి వెంకన్నతో కలిసి గురువారం పొలానికి నీలి మందు పిచికారీ చేయడానికి వెళ్లారు. అందులో భాగంగా నీటి కోసం యల్లయ్య బోరు మోటారు ఆన్ చేసే క్రమంలో కరెంటు షాక్‌కు గురయ్యారు. అది చూసిన వెంకన్న యల్లయ్యను పట్టుకోగానే ఆయనకు షాక్ కొట్టి దూరంగా పడ్డారు. భార్య రేణుక పెద్దగా కేకలు వేయటంతో పక్కనే ఉన్న కొందరు రైతులు విద్యుత్తు నియంత్రిక వద్ద సరఫరాను నిలిపేశారు. యల్లయ్యను వెంటనే పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా.. పరిశీలించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య రేణుక, తల్లి సీతమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉండగా... పెద్ద కుమార్తెకు వివాహమైందని చెప్పారు.



యల్లయ్య

పురుగుమందు తాగి వ్యక్తి బలవన్మరణం

నాంపల్లి, న్యూస్‌టుడే: అనారోగ్యం కారణంగా మనస్తాపానికి గురైన వ్యక్తి పురుగు మందు తాగి మృతి చెందిన ఘటనపై గురువారం నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఎం.శోభన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. గట్లమల్లేపల్లికి చెందిన మల్గిరెడ్డి సైదిరెడ్డి(36) దంపతులకు కుమార్తె(3) సంతానం. గత కొంతకాలంగా సైదిరెడ్డి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండగా, భార్య కూడా రెండేళ్లుగా మూర్ఛ వ్యాధితో ఇబ్బంది పడుతూ పుట్టింట్లోనే ఉంటోంది. భార్యభర్త ఇరువురు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటుండటంతో ఇటీవలే వీరి కుమార్తెను హైదరాబాద్‌లోని కీర్తనా ఫౌండేషన్ సంరక్షణలో ఉంచారు. కాగా తీవ్రమైన జబ్బుతో బాధపడుతున్న అతడు మంగళవారం వ్యవసాయ పొలం వద్ద పురుగు మందు తాగి బలవన్మరణం చెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

సాగర్ నుంచి నీటి విడుదల

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: సాగర్ జలాశయానికి ఎగువ నుంచి భారీగా వరదనీరు వస్తుండడంతో ఎన్నెస్పీ అధికారులు మరోసారి గురువారం మధ్యాహ్నం నుంచి డ్యాం గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. రాత్రి 9 గంటల వరకు అందిన సమాచారం మేరకు శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 2,42,561 క్యూసెక్కులు వరద నీరు వస్తుండడంతో అధికారులు డ్యాం 24 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,92,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. గేట్లతో పాటుగా కుడి, ఎడమకాల్వ, ప్రధాన విద్యుత్ కేంద్రం, ఎస్ఎల్బీసీ, వరద కాల్వ ద్వారా మొత్తం 2,42,561 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయనీటిమట్టం 590.00 అడుగులు కాగా.. 312.0450 టీఎంసీల వద్ద ఉంది.

తండ్రికి శాంతి చేస్తూ తనయుడి దుర్మరణం

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: కొద్దిరోజుల క్రితం మరణించిన తండ్రికి శాంతి చేస్తుండగా.. తనయుడు కోనేరులో పడి మృతిచెందిన విషాద సంఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం పాతసూర్యాపేటలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతసూర్యాపేటకు చెందిన పోలోజు రుక్మాచారి 25 రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. అతనికి భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రుక్మాచారికి శాంతి చేసే కార్యక్రమంలో భాగంగా కుటుంబ సభ్యులు గురువారం గ్రామ సమీపంలోని చక్రయ్యగుట్టపైకి వెళ్లారు. అక్కడ కుమారుడు పోలోజు మహేష్‌చారి(22) శాంతి ప్రక్రియ పూర్తి చేసి గుట్టమీద ఉన్న కోనేరులో స్నానమాచరించేందుకు వెళ్లారు. కాలుజారి కోనేరులో పడిపోయి.. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయారు. ఆ సమయంలో కుటుంబ సభ్యులు, బంధువులు చుట్టూ ఉన్నా రక్షించలేకపోయారు. కోనేరులోనే ఈత కొడుతున్న కొందరు బంధువులు అతన్ని కాపాడేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. పరిసర ప్రాంత రైతులు వచ్చి మహేష్ మృతదేహాన్ని వెలికితీశారు.

★ బతుకుదెరువు కోసం పదిహేనేళ్ల క్రితం ఇదే జిల్లాలోని నూతనకల్ మండలం ఎర్రపహాడ్‌కు వెళ్లిన వీరి కుటుంబం తండ్రి అనారోగ్యం పాలవడంతో ఇటీవల పాతసూర్యాపేటకు వచ్చారు. నెల రోజుల వ్యవధిలో తండ్రి, కుమారుడు చనిపోవడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. మృతుడి తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ ఆర్.శంకర్‌నాయక్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో.. ఆత్మహత్య

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామంలో ఉరేసుకొని ఒకరు మృతి చెందినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపారు. సంస్థాన్‌నారాయణపురం మండలం జనగాం గ్రామానికి చెందిన సుక్క రాజు(36) డీసీఎం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్యతో కలిసి అత్తగారి ఊరు దండుమల్కాపురం లోనే నివాసం ఉంటున్నాడు. గత కొంత కాలం నుంచి భార్యతో రాజుకు తగాదాలు నడుస్తున్నాయి. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు కూడా ఎక్కువ అవ్వడంతో ఇంట్లోనే ఉరేసుకొని చనిపోయాడు. గురువారం మధ్యాహ్నం స్థానికులు గమనించి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.



సుక్క రాజు

సిల్క్‌నగర్‌లో సమస్యల తిష్ఠ

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరు పట్టణంలోని సిల్క్‌నగర్ వాసులు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. కాలనీకి పడమర వైపున పెద్ద ముగురు కాలువ ఉండటం, కాలనీలో నివాసాల మధ్యన అక్కడక్కడా ఖాళీ ప్లాట్లలో మురుగు నిల్వ ఉండటం, కంపచెట్లు పెరగడంతో



సిల్క్‌నగర్ కాలనీలో మురుగు నీరు ఇలా...

పందులు ఆవాసం ఏర్పరచుకున్నాయి. దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఫలితంగా కాలనీ వాసులు జ్వరాల బారిన పడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు పురపాలిక అధికారులకు తెలిపినప్పటికీ పట్టించుకోవడం లేదని కాలనీకి చెందిన సత్యనారాయణ 'న్యూస్‌టుడే'తో ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పుర కమిషనరు లక్ష్మి దృష్టికి తీసుకు వెళ్లగా క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

మేమున్నామని మీకేం కాదని..

☛ పూర్వ విద్యార్థులను ఆదుకుంటున్న స్నేహితులు

ప్రతిఒక్కరి జీవితంలో చిన్ననాటి జ్ఞాపకాలు మరువలేనివి. ప్రతి సమయంలో అవి గుర్తుకు వస్తూనే ఉంటాయి. నాడు కలిసి చదువుకుని పెద్దయ్యాక ఉపాధి, ఉద్యోగ నిమిత్తం వెళ్లినా చిన్ననాటి స్నేహితులను మరిచిపోరు. కొన్ని సంవత్సరాల తరువాత వారిని కలిసి జ్ఞాపకాలను తలచుకొని సంతోషంగా గడుపుతారు. కాని కొందరు స్నేహితుల విషయంలో విషాదాలు జరుగుతుంటాయి. వారి విషయంలో స్నేహితులు ఏకమై వారి కష్టానికి తమవంతు సాయం అందించి మీకేం కాదని మేమున్నామని ధైర్యం చెబుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

– భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే:

25 వసంతాలైనా..

పట్టణ కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 1998-99 సంవత్సరం విద్యార్థులు ఇటీవల 25 వసంతాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. తమతో పాటు 5వ తరగతి చదువుకున్న తోటి విద్యార్థులైన కవిత, మంగ భర్తలు చనిపోయారన్న విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు అప్పటికప్పుడు వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.11వేల చొప్పున ఆర్థికసాయం అందించి మేమున్నామని ధైర్యం చెప్పి ఆదర్శంగా నిలిచారు.



కవిత, మంగ కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు



రావుల నాగేష్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

ఆర్థికసాయంతో పాటు.. నిత్యావసర సరకుల పంపిణీ

పట్టణ కేంద్రంలోని రావుల నాగేష్ ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన కుటుంబం కష్టాల్లో ఉందని తెలుసుకున్న పూర్వ విద్యార్థుల బృందం రూ.40 వేల ఆర్థికసాయంతో పాటు నిత్యావసర సరకులు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న 2005-06 విద్యార్థులు చందాలు వేసుకొని కుటుంబానికి సాయం అందించారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరుకు చెందిన యువకుడు తాటికాయల సురేందర్ ఇటీవల మరణించాడు. బాధిత కుటుంబానికి పదో తరగతి 1999-2000 జడ్పీహెచ్చెస్, ఆలేరు స్నేహితులు అండగా నిలిచారు. స్నేహితులు తలా కొంత నగదును పోగుచేయగా వచ్చిన రూ. 51,500 నగదును మృతుని భార్య, కూతురుకు అందజేశారు. సురేందర్ మృతిపట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. సూదగాని సాగర్, ఇక్కిరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



కుటుంబ సభ్యులకు నగదును అందజేస్తున్న చిన్ననాటి స్నేహితులు

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80082 78928 80085 74375

బొమ్మలరామారం, న్యూస్‌టుడే:

? బొమ్మలరామారం మండలం యావపూర్ గ్రామంలో మంచినీటి పైపు లీకై నీరు కలుషితమవుతోంది, వెంటనే నివారించాలి. – శంకర్, యావపూర్.

✔ గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలియజేసి మరమ్మతులు చేయిస్తాం. – విజయకుమార్, పంచాయతీ కార్యదర్శి, మర్యాల.

సంక్షిప్త సమాచారం

బాధ్యతలు స్వీకరించిన ఏఈ.. గుండాల: మండల విద్యుత్తు శాఖ ఇన్‌ఛార్జి ఏఈగా విధులు నిర్వహిస్తున్న ఎం.భరత్‌కుమార్ బదిలీపై యాదగిరిగుట్టకు వెళ్లడంతో ఏఈగా అంబాల నరసింహ, లైన్ ఇన్‌స్పెక్టర్‌గా కె.అంజయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది స్వాగతం పలికారు.

అపోహలు సృష్టిస్తున్నారు.. భువనగిరి పట్టణం: ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం పట్టణంలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలల ఎదుట ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. కళాశాలల యాజమాన్యాలు ఎమ్మెల్యే, విద్యా సంస్థల యజమాని పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కుమ్మక్కై తమ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసేందుకు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు.

దిష్టిబొమ్మ దహనం.. మోత్కూరు, అడ్డగూడూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు గురువారం మోత్కూరు అంబేడ్కర్ చౌరస్తా, అడ్డగూడూరులో దిష్టిబొమ్మ దహనం చేశారు. అడ్డగూడూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సింగిల్‌విండో ఛైర్మన్ పి.వెంకటేశ్వర్లు, కంచర్ల యాదగిరిరెడ్డి, ఆర్.బాల్‌రాజు, జి.రామచంద్రుగౌడ్, డాక్టర్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి, పైళ్ల సోమిరెడ్డి, కడారి రమేష్, వల్లంభట్ల రవీందర్‌రావు, రమేష్, చుక్క యాదగిరి, రామచంద్రయ్య, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రచార కరత్రాల ఆవిష్కరణ.. బీబీనగర్, న్యూస్‌టుడే: బీబీనగర్ షాదీఖానాలో నవంబరు 3న జరిగే సీపీఎం మండల 8వ మహాసభలు జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. సీపీఎం కార్యాలయంలో మండల మహాసభలకు సంబంధించిన ప్రచార కరపత్రాలను గురువారం ఆయన ఆవిష్కరించారు. మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, నాయకులు దేవేందర్‌రెడ్డి, దాసు, హరికృష్ణ, శ్రవణ్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు సన్మానం.. ఆత్మకూరు(ఎం), న్యూస్‌టుడే: ఆత్మకూరు ఠాణాలో పనిచేస్తూ డీఎస్సీలో ఎస్జీటీగా ఎంపికై సూర్యాపేట జిల్లాలో విధుల్లో చేరిన రేణుకను సీఐ సోలోమన్‌రాజు, ఎస్సై ఎస్.కృష్ణయ్య సన్మానించారు. కానిస్టేబుల్‌గా ఆమె అందించిన సేవలను కొనియాడి, ఉపాధ్యాయురాలిగా విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలని ఆకాంక్షించారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు రేణుకను గురువారం విధుల నుంచి రిలీవ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఏఎస్ఐ సైదులు, ఠాణా సిబ్బంది పాల్గొన్నారు.

టీచర్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన

భువనగిరి, న్యూస్‌టుడే: ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హులైన ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవాలని భాజపా జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ తెలిపారు. భాజపా జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆలేరు, భువనగిరి అసెంబ్లీల నుంచి అన్ని మండలాల ఎమ్మెల్సీ ఎలక్షన్ ఎన్‌రోల్‌మెంట్ ప్రముఖులు, సహ ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. . ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పార్లమెంట్ కన్వీనర్ బండారపు లింగస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్‌గుప్తా, ఉట్కూల అశోక్‌గౌడ్, జిల్లా ప్రముఖ దంతూరి సత్తయ్య, ఆలేరు నియోజకవర్గ సహ ప్రముఖ్ సుంకరి సృజన్‌కుమార్, భువనగిరి నియోజకవర్గ ప్రముఖ్ గోపాల్‌రెడ్డి హాజరయ్యారు.



మాట్లాడుతున్న పాశం భాస్కర్

అక్రమ మ్యుటేషన్ నిలిపివేయాలని ధర్నా

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని యాదగిరిపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 152లోని 2-02 ఎకరాల భూమిపై జరుగుతున్న అక్రమ మ్యుటేషన్ నిలుపుదల చేయాలని ఆ ప్రాంత వాసులు గురువారం యాదగిరిగుట్ట తహసీల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. తహసీల్దారు దేశ్యను నిలదీశారు. పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళనకారులకు సర్దిచెప్పారు. అనంతరం తహసీల్దారును వినతిని అందజేశారు. ఈ సందర్భంగా పుర ఉపాధ్యక్షుడు కాటంరాజు, నాయకులు పాపట్ల నరహరి, శిఖ శ్రీను, ర్యాకల రాజు, సీస కృష్ణ మాట్లాడుతూ.. ఆ భూమిని దాతలు అన్ని కులాల వారికి గుంటల చొప్పున విరాళం ఇచ్చారని, తదుపరి కాలంలో అక్కడ ధోబీఘాట్, సమాధులు, కమ్యూనిటీ భవనాలు వెలిశాయని తెలిపారు. విలువైన భూమిపై కన్నేసిన స్థిరాస్తి వ్యాపారి ధరణిలో జరిగిన తప్పిదాలను ఆసరాగా చేసుకొని, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై అక్రమ మ్యుటేషన్ చేసి, రిజిస్ట్రేషన్ చేయడానికి ప్రయత్నాలు చేపట్టారని ఆరోపించారు. తహసీల్దారు దేశ్య వివరణ కోరగా డీఎస్ పెండింగ్‌లో భూమి ఉండటం వల్ల వారి దరఖాస్తు మేరకు నిబంధనల ప్రకారం మ్యుటేషన్ చేపట్టామని, అది పూర్తి కాలేదన్నారు. వాస్తవాలపై శుక్రవారం క్షేత్రస్థాయిలో సర్వేయర్ ద్వారా పరిశీలనలు చేసి నిర్ధారణ చేస్తామన్నారు. ఆ భూమిని ధోబీఘాట్, ఇతరత్రా వాటికి కేటాయిస్తే ఆధారాలు, ఉత్తర్వుల ప్రతులను చూపించాలని కోరారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తూ, విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతల శివ, కార్యదర్శి లావుడియా రాజు ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని, నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడించారు. పెండింగ్‌లో ఉన్న రూ.8,300 కోట్ల ఫీజులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేముల నాగరాజు, ఈర్ల రాహుల్, శ్రీనివాస్, జగన్, ఉదయ్, భవానీ, సతీష్, శంకర్, వెంకటేష్, చింటూ, శివ, అనుష్, కీర్తన, మమత, పాల్గొన్నారు.

☛ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ప్రదర్శన పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు కొనసాగింది. క్యాంపు ఎదుట బైఠాయించి విద్యార్థులు, నాయకులు నినాదాలు చేశారు. కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు విద్యార్థులు ప్రయత్నించడంతో కొద్ది సేపు ఉద్రిక్త వాతావరణ నెలకొంది. విద్యార్థులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. పలువురు విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

విద్యుత్తు నియంత్రికల ధ్వంసం

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని గిరిజనతండాల్లో వ్యవసాయ బోర్లకు సంబంధించిన రెండు విద్యుత్తు నియంత్రికలను గుర్తు తెలియని దుండగులు గురువారం తెల్లవారుజామున ధ్వంసం చేశారు. విద్యుత్తుశాఖ అధికారులు పోలీసులకు ఇచ్చిన సమాచారం ప్రకారం.. గంగమూలతండా, మూడుగుడిసెలతండా పరిధిలో వ్యవసాయ పొలాల వద్ద రైతులకు సంబంధించి 25 కేవీ విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. గుర్తు తెలియని దుండగులు విద్యుత్తు సరఫరాను నిలిపివేసి దిమ్మెమీద ఉన్న ట్రాన్స్ ఫార్మర్లను కింద పడేసి ధ్వంసం చేశారు. కాపర్ వైరును చోరీ చేశారు. చోరీ జరిగిన ప్రాంతాన్ని విద్యుత్తుశాఖ అధికారులు, పోలీసులు సందర్శించారు. అపహరణకు గురైన సొత్తు విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని విద్యుత్తు శాఖ ఏఈ దివ్య తెలిపారు.

హజ్రత్ గఫ్ఫార్ ఉర్సు

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: భువనగిరి పట్టణంలోని హజ్రత్ గఫ్ఫార్ ఖాద్రీ రూహి బియాబాని ఉర్సు ఉత్సవాలు బుధవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఖాజీ మహెల్లాలోని సజ్జాదే నషీన్ అంజద్ బియాబాని ఇంటి నుంచి ప్రారంభమైన గంధం ప్రదర్శన హైదరాబాద్ చౌరస్తాలోని దర్గా వరకు కోలాహలంగా కొనసాగింది. హజ్రద్ సమాధిపై మత పెద్దలు పూల చాదర్‌ను సమర్పించారు. ప్రత్యేక ప్రార్థలు నిర్వహించారు. మత పెద్దలు అఫ్జల్ బియాబాని, మహ్మద్ ఇఫ్తెఖార్, వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇంతియాజ్ అహ్మద్, నాయకులు షానూర్ బాబా, జలీల్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వస్త్రాల పంపిణీ

భువనగిరి, న్యూస్‌టుడే: భాజపా కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ పడమటి జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. భాజపా నేతలు, కార్యకర్తలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రోటరీక్లబ్, జననీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాండురంగారావు, శెట్టి బాలయ్యయాదవ్, వైజయంతి, బీజేపీ జిల్లా కార్యదర్శి భాస్కర్, వేణు, మల్లారెడ్డి, కిషోర్, వెంకటేష్, అశోక్‌రెడ్డి, నర్సింగరావు, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



కార్మికులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, రోటరీ క్లబ్ సభ్యులు, భాజపా నాయకులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తుర్కపల్లి, న్యూస్‌టుడే: తుర్కపల్లి మండలం మాదాపురం గ్రామ సమీపంలో గురువారం రాత్రి యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మల్కాపురం గ్రామానికి చెందిన సొన్నాయిల గణేశ్(26) ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా అదుపుతప్పి పడిపోయాడు. యువకుడికి ఇటీవల వివాహం జరిగింది. ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుకునే క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తక్యూద్దీన్ తెలిపారు.

భక్తుడి హఠాన్మరణం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో దైవ దర్శనానికి గురువారం వచ్చిన భక్తుడు హఠాన్మరణం చెందారు. షాద్‌నగర్‌లోని మేకగూడ (జేపీ దర్గా)కు చెందిన పోచయ్య(55) శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకునేందుకు కుటుంబంతో కొండపైకి చేరుకున్న ఆయనకు శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది కలిగింది. ఆయన్ను అక్కడి నుంచి దేవస్థానానికి చెందిన బ్యాటరీ వాహనం ద్వారా కొండ కింద ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యసిబ్బంది తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత.. కేసు నమోదు

ఆత్మకూరు(ఎం), న్యూస్‌టుడే: అక్రమంగా ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ పి.సోలోమన్‌రాజు తెలిపారు. కామునిగూడేనికి చెందిన మాద శ్రీధర్ గ్రామంలోని బిక్కేరు వాగులో గురువారం సాయంత్రం ట్రాక్టర్‌లో ఇసుకను లోడ్ చేస్తుండగా కానిస్టేబుళ్లు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని ఠాణాకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

కేసు నమోదు

వలిగొండ, న్యూస్‌టుడే: వలిగొండలోని బెంగుళూరు బేకరిలో గడువు ముగిసిన, కల్తీ ఆహారం విక్రయిస్తుండగా పోలీసులు దాడులు చేశారు. కల్తీ ఆహారం తయారు చేయడానికి వినియోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యుగేంధర్ గురువారం తెలిపారు.

డీసీఎం వాహనం బోల్తా

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై బొర్రొళ్లగూడెం స్టేజీ వద్ద బుధవారం అర్ధరాత్రి డీసీఎం వాహనం బోల్తా పడింది. మిర్యాలగూడ నుంచి బియ్యం లోడుతో హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం వాహనం డీవైడర్‌ను ఢీకొని బోల్తా పడగా.. డ్రైవర్ ఈ ప్రమాదం నుంచి క్షేమంగా బయపడ్డాడు. జాతీయ రహదారిపై డీసీఎం వాహనం బోల్తా పడటంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని క్రేన్ సాయంతో వాహనంను పక్కకు తరలించారు. అనంతరం వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో ప్రమాదం సంభవించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.





వ్యాస రచన పోటీల్లో ప్రతిభ

భువనగిరి పట్టణంలోని జీనియస్ హైస్కూల్‌లో 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో పాఠశాలకు చెందిన శశికళ(తొమ్మిదో తరగతి) ప్రథమ, సుశీల్ సింగ్ కశ్యా(పదో తరగతి) ద్వితీయ, పి.స్నిగ్ధ(పదో తరగతి), తృతీయ బహుమతిని గెలుచుకున్నారు. విజేతలకు ప్రిన్సిపల్ స్వర్ణలత బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ పడాల శ్రీనివాస్, కరస్పాండెంట్ డాక్టర్ బొజ్జా సూర్యనారాయణరెడ్డి, ఏవో రవి పాల్గొన్నారు.– భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే:

స్వీయ నియంత్రణ పాటించాలి

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: సెల్‌ఫోన్ వినియోగంలో స్వీయ నియంత్రణ పాటించాలని పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం పట్టణంలోని శ్రీవాగ్దేవి జూనియర్ కళాశాలలో 'సెల్‌ఫోన్ వాడకం' అనే అంశంపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 27 వరకు పలు అంశాలపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సమయాన్ని సెల్‌ఫోన్‌కు బదులుగా పుస్త పఠనం, కుటుంబ సభ్యులతో గడిపేందుకు కేటాయించిన పక్షంలో పలు ప్రయోజనాలు ఉంటాయన్నారు. సైబర్ నేరాల బారిన పడినప్పుడు 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో సీఈవో దర్పల్లి ప్రవీణ్‌కుమార్, బాలేశ్వర్, ప్రిన్సిపల్ శ్రావణ్‌రెడ్డి, యాకూబ్, రామకృష్ణ, శ్యాంకుమార్, శ్రీకాంత్, నాగ మల్లేష్, అశోక్, వీరయ్య మోయిన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సురేష్

న్యాయవాదుల రక్షణ చట్టం కావాలి



చౌటుప్పల్‌లో న్యాయవాదుల సభ్యత్వం సేకరిస్తున్న 'ఐలు' జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మామిడి వెంకట్‌రెడ్డి, తడక మోహన్

చౌటుప్పల్, న్యూస్‌టుడే: న్యాయవాదుల రక్షణకు చట్టాన్ని ఏర్పాటు చేయాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి, కార్యదర్శి తడక మోహన్‌లు ప్రభుత్వాన్ని కోరారు. చౌటుప్పల్‌లోని బార్ అసోసియేషన్ హాలులో గురువారం న్యాయవాదుల నుంచి సభ్యత్వం సేకరించి మాట్లాడారు. న్యాయవాదులపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వారికి రక్షణ చట్టం అవసరమన్నారు. బార్ కౌన్సిల్‌లో 2019 తర్వాత నమోదు చేసుకున్న న్యాయవాదులకు ఆరోగ్య కార్డులు ఇవ్వలేదని, మంజూరు చేయాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్, కార్యదర్శి రాపోలు వేణు, జిల్లా రమేశ్, మహిపాల్ రెడ్డి, ఎండి ఖయ్యూం, శేఖర్, పరమేశ్, శ్రీశైలం, స్వాతి పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదు

మోత్కూరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లి, భాజపా సభ్యత్వాలను పెంచాలని సూర్యాపేట జిల్లా సభ్యత్వ నమోదు పదాధికారి మర్రి మోహన్‌రెడ్డి కోరారు. గురువారం మోత్కూరులో బూత్ అధ్యక్షుడు, జిల్లా కమిటీ నాయకులతో సభ్యత్వ నమోదుపై సమీక్షించారు. ప్రతీ బూత్‌కు 300 సభ్యత్వాలు తగ్గకుండా చేయించాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సాయిబాబా, నియోజకవర్గ కన్వీనర్ కె.రవి, కోకన్వీనర్ కె.వెంకన్న, అడ్డగూడూరు మండల అధ్యక్షుడు సైదులు, గౌరు శ్రీనివాస్, ఏనుగు జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భువనగిరి: కేంద్రంలోని భాజపా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు, యువత ఆకర్షితులు అవుతున్నారని భాజపా జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అన్నారు. భాజపా యువమోర్చా ఆధ్వర్యంలో స్థానిక నూతన బస్టాండ్ దగ్గర గురువారం చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్, భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు రత్నపురం బలరాం, బీజేవైఎం నాయకులు గణేష్, క్రాంతి, నరేష్, భాజపా పట్టణ ప్రధాన కార్యదర్శి రాళ్లబండి కృష్ణాచారి, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

నందనంలో చోరీ

భువనగిరి గ్రామీణం: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన నందనంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొండపురం బాలరాజు ఈ నెల 20న ఇంటికి తాళం వేసి బాత్రూంలో పెట్టి ఉప్పల్‌లో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లారు. ఉదయం 8గంటల సమయంలో ఇంటి తలుపులు తెరచి ఉండగా బంధువులు గమనించి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఇంటికి వచ్చి చూసుకోగా ఇంటిలోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని ఎనిమిది తులాల బంగారు నగలు(నక్లెస్, లాంగ్‌చైన్, మాటీలు) కన్పించలేదు. సుమారు 70 తులాల వెండి పట్టీలు దొంగతనానికి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గ్రామీణ ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు

భువనగిరి గ్రామీణం, తుర్కపల్లి, న్యూస్‌టుడే: బాల్య వివాహాన్ని అడ్డుకున్న ఘటన తుర్కపల్లి మండలం బీర్యానాయక్‌తండాలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... తండాకు చెందిన బాలిక(17)కు వివాహం జరిపేందుకు ఏర్పాట్లు చేస్తుండగా ఛైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందింది. బాలల పరిరక్షణ సమితి అధికారులు పోలీసుల సహకారంతో దాడి నిర్వహించి అడ్డుకున్నారు. బాలికతో పాటు కుటుంబ సభ్యులను బాలల సంరక్షణ సమితి ఎదుట హాజరు పరిచారు. సమితి ఛైర్‌పర్సన్ బండారు జయశ్రీతో పాటు సభ్యులు కౌన్సెలింగ్ జరిపి, బాలికను రక్షణ నిమిత్తం సఖీ కేంద్రంలో వసతి సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో బాలల పరిరక్షణాధికారి సైదులు, బాల్య వివాహ నిరోధక అధికారి విజయరాణి, సిబ్బంది పాల్గొన్నారు. 18 ఏళ్లు నిండే వరకు వివాహం జరపబోమని తల్లిదండ్రులతో లేఖ రాయించుకున్నారు.

లయన్స్ క్లబ్ సహాయం

స్పందనకు వందనం

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్ పురపాలిక లింగారెడ్డిగూడెంలో కండర క్షీణత వ్యాధి బాధితురాలు ఊదరి రమణ దయనీయ స్థితిపై ఈనాడులో 'అమ్మ తినిపించాల్సిందే...నాన్న ఎత్తుకోవాల్సిందే' శీర్షికతో ఈనెల 21న ప్రచురించిన మానవీయ కథనానికి చౌటుప్పల్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు స్పందించారు. రూ.12వేలు విలువైన నిత్యావసర సరకులను వారి ఇంటికి వెళ్లి గురువారం అందజేసి మానవత్వం చూపారు. లయన్స్ క్లబ్ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ దాచపల్లి ప్రకాశ్, జోనల్ ఛైర్మన్ నాంపల్లి రమేశ్, క్లబ్ అధ్యక్షుడు కొసనం రామ్‌రెడ్డి, పాల్గొన్నారు.

☛ నిరుపేద కుటుంబానికి చెందిన నూరు శాతం శాశ్వత వైకల్యమున్న ఊదరి రమణకు పింఛను రావడం లేదనే మానవీయ కథనానికి పురపాలిక కమిషనర్ కె.నర్సింహారెడ్డి స్పందించారు. మంజూరు చేయాలని చరవాణిలో డీఆర్డీవోను ఆయన కోరారు. పింఛను మంజూరుకు అవసరమైన పత్రాలను డీఆర్డీవో కార్యాలయానికి పంపారు.

పరిశ్రమ అనుమతులు రద్దు చేయించండి: చిరుమర్తి

రామన్నపేట, న్యూస్‌టుడే: రామన్నపేటలో ప్రజలకు హాని కలిగించే సిమెంటు పరిశ్రమ అనుమతులను అధికార పార్టీ ప్రజాప్రతినిధులు రద్దు చేయిస్తే.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ ప్రాంత అధికారిక పదవులన్నీ ఏకగ్రీవంగా కాంగ్రెస్‌కే అప్పగిస్తామని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. రామన్నపేటలో గురువారం విలేకరులతో మాట్లాడారు. రాజకీయాలకు ఇది సమయం కాదని.. సిమెంటు పరిశ్రమ ఏర్పాటును అడ్డుకోవడమే ప్రధాన ఎజెండాగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మల్లేశం, సాల్వేరు అశోక్, శ్రీనివాస్, సతీశ్, నర్సింహ, సంతోశ్, మల్లేశం, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రామన్నపేట: సిమెంటు పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా పోరాటాన్ని ఉద్ధృతం చేయాలని ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి కోరారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన సమితి ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. అక్రమ అరెస్టులు చేయించి అడ్డుకోవటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గోపాల్, శంకరయ్య, వెంకటేశం, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రామన్నపేట: రామన్నపేటలో సిమెంటు పరిశ్రమ ఏర్పాటుపై నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో వాస్తవాలతో కూడిన నివేదికను పంపించాలని మండల పర్యావరణ పరిరక్షణ వేదిక, అఖిలపక్ష నాయకులు భువనగిరిలో కలెక్టరు హనుమంతు కె.జెండగేను కలిసి వినతిపత్రం అందజేశారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఆత్మకూరు(ఎం), న్యూస్‌టుడే: మండలంలోని కూరెళ్ల, పల్లెర్ల, లింగరాజుపల్లి, పుల్లాయిగూడెం గ్రామాల్లో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్యాక్స్ ఛైర్మన్ జిల్లాల శేఖర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. వైస్ ఛైర్మన్ గంధమల్ల జహంగీర్, సభ్యులు పాల్గొన్నారు.

చౌటుప్పల్: జిల్లాలో 230 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు జిల్లా సహకార అధికారి నామా శ్రీధర్ తెలిపారు. చౌటుప్పల్ మార్కెట్ యార్డులో, తాళ్లసింగారం పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పురపాలిక ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు, పీఏసీఎస్ ఛైర్మన్ దామోదర్‌రెడ్డిలతో కలిసి గురువారం ప్రారంభించి మాట్లాడారు. 79 కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని, మిగితావి ఒకటి, రెండు రోజుల్లో ప్రారంభిస్తామని వెల్లడించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

వలిగొండ, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని గురువారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... పచ్చర్లబోడుతండాకు చెందిన ధరావత్ వెంకటేశం, కున్సోత్ బలరాం తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా 12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని వలిగొండ మండలం నాగారం పరిధిలో పోలీసులు పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యుగేంధర్ తెలిపారు.